# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 16-07-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**2. చేనేత, జౌళి శాఖల పునరుజ్జీవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

**3. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది.**

**4. తెలంగాణలో పంటల రుణమాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.**

**5. అల్పపీడనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. భూములు, సహజ వనరులకు సంబంధించి వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం శాశ్వత భూహక్కు -భూరక్ష పథకం పేరుతో అనాలోచితంగా రీ సర్వేను చేపట్టిందని విమర్శించారు. భూహక్కు చట్టం దేశంలో ఎక్కడా అమలులో లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ లో భూ యజమానులకు రక్షణ కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ భూ సేకరణ చట్టాన్ని తెస్తామని ముఖ్యమంత్రి తెలుపుతూ....

వాయిస్ (36 సెకన్లు)

---------------------------

ఈ నెల 27వ తేదీన 4వ జాతీయ ప్రధాన కార్యదదర్శుల సమావేశం నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి వర్గ కార్యదర్శి రాజీవ్ గౌబ తెలిపారు. నిన్న ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గౌబ మాట్లాడుతూ, నీతి ఆయోగ్ 9వ పాలకమండలి సమావేశాన్ని కూడా త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన వికసిత్ భారత్ గా

తీర్చిదిద్దాలన్న లక్ష్యాల్లో భాగంగా ప్రధాన కార్యదర్శుల సమావేశం, నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జాతీయ స్థాయిలో ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంచాయతీల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమ పట్టిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత, జౌళి పరిశ్రమల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో జౌళి, చేనేత పరిశ్రమల ప్రతినిధులతో పాటు చేనేత కార్మిక సంఘాలతో మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రోత్సాహకాలను చెల్లించడంపై దృష్టి సారిస్తామన్నారు. భవిష్యత్తులో చేనేత కార్మికుల ఉత్పత్తి సామర్థ్యం మేరకు విద్యార్థుల ఏకరూపదుస్తులతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సకాలంలో ఆర్డర్లు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేనేత, జౌళి శాఖల పునరుజ్జీవానికి కట్టుబడి ఉన్నారు. ఆప్కోకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీ అంశంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిన్న హైదరాబాదులో సమావేశం నిర్వహించింది. ఇరు రాష్ట్రాల జల వనరుల శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నీటి పంపకానికి సంబంధించిన వివిధ అంశాలను ఈ సమావేశంలో అధికారులు చర్చించారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో తాజా అఫిడవిట్ దాఖలు చేయడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం సమయం కోరింది. దీంతో ఆంధ్ర ప్రదేశ్ అఫిడవిట్ ను దాఖలు చేయడానికి ట్రిబ్యునల్ నాలుగు వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆగష్టు 28, 29 తేదీలకు వాయిదా వేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఈ రోజు సమావేశం కానుంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు సంబంధించి ఆర్డినెన్స్‌కు అమోదం, ఎన్నికల హామీలు, వాటి అమలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా మంత్రివర్గంలో చర్చించే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు సాయంకాలం ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ పర్యటనలో పలువురు కేంద్రమంత్రులను కలవనున్నారని

ప్రభుత్వ వర్గాలు తెలిపాయి

---------------------------

తెలంగాణలో రైతు భరోసా అమలుపై శాసన సభలో చర్చిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హనుమకొండ జిల్లాలో రైతు భరోసాపై చేపట్టిన రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులతో కలిసి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతు భరోసా పథకంపై రైతులందరి నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఆగస్టు నాటికి రైతులందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. రైతులకు బీమా సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అర్హులకే రైతు భరోసా పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా నాయుడుపేట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలా వీరాంజనేయస్వామి పరామర్శించారు. గూడూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను గత రాత్రి పరామర్శించిన మంత్రి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిన్న అమరావతిలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, నిడదవోలు నియోజక వర్గ పరిధిలో 10 కోట్ల 28 లక్షల 53 వేల రూపాయలతో 172 సి సి రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే నిడదవోలులో మురుగు నీటి నిల్వ వ్యవస్థను పటిష్టం చేసేలా చర్యలు చేపట్టనున్నామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా అతిసార, కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పూర్తిస్థాయి మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో పంటల రుణమాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. కుటుంబానికి 2లక్షల రూపాయల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాల బకాయిలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందని, రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్‌కార్డు ప్రామాణికమని తెలిపింది. రుణమాఫీ నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తామని, రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయనున్నామని, రైతులకు సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్ వీక్షించవచ్చని లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చని మార్గదర్శకాల్లో తెలిపింది.

---------------------------

తెలంగాణలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 20వ తేదీన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలను జారీ చేసింది. తల్లిదండ్రుల భాగస్వామ్యం అనే ఇతివృత్తంతో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరయ్యేలా అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు ఆహ్వానం ఇవ్వాలని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

ఒడిషా తీరాన్ని ఆనుకుని వాయవ్య, పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీనికి తోడు ఉపరితల ఆవర్తనం, రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతున్నాయని వీటి ఫలితంగా ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాకినాడ, ఉభయ గోదావరి, ఎన్.టి.ఆర్, ఏలూరు, పార్వతీపురం మన్యం, డా బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, నెల్లూరు, తిరుపతి, శ్రీకాకుళం, ప్రకాశం, విజయనగరం, పల్నాడు, అనకాపల్లి, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలలో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాగల ఐదు రోజులపాటు ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================